# దాంపత్యం

క. శ్రీ సూర్యనారాయణ రెడ్డి గారు

## ౧

'నువ్వేం మొగుట్ట నేను పెళ్ళాంట వంటచేసుకుంటాంట ఏం?'

'ఊఁ'

'నువ్వు బజారుకెళ్తావుట, కూరటా, నెయ్యా, పెరుగూ పట్టుకొస్తావుట'

'ఊఁ'

'వెళ్ళుమరీ తరవాత నువ్వు ఆఫీసుకెళ్ళాలి కాదూ? టయిమవదూ?'

'ఇవ్వోతెచ్చేను అదేంటీ? పొయిమండటంలేదేం? అన్నం ఎలాఅవుతుందీ?'

'అబ్బ. అలాఅయితే నేనాట్టం లేదు బాబూ, మండుతూంది అనాలి.'

'ఊఁ, మండుతూంది'

'కూర్చో, వడ్డిస్తా'

'ఊఁ'

'ఇవ్వేం మంచీళ్ళు ఇదేంపప్పు!'

'ఛీ ఛీ, అదేంటి మన్ను!'

'అల్లాఅయితే చూడూ—!'

'పప్పేం మాంచిబాగుంది?'

'అన్నం . కలుపుకో?'

'నెయ్యేదీ?'

'ఇదుగో ఇదేం పులుసు. ఇదేంచారు. ఇవ్వేం గారెలు బొబ్బట్లుకావాలా?'

'ఓస్!'

'అబ్బ!'

'అదేంటీ అందులో?'

'పెరుగు'

'నువ్వుతినవూ అన్నం?'

'నేనూతింటా మానాన్నేం అన్నంతిన్నాక ఆఫీసుకెళతాడు అప్పుడేం అమ్మ తమలపాకులకి సున్నంరాచిస్తుంది.'

'మాఅమ్మా రాచిస్తుందీ!'

'అప్పుడేం నాన్న అమ్మగడ్డం పట్టుకుంటాడు'

'ఏవిఁట్రా పిల్లలూ!'

## ౨

'సరళా! ఇప్పటికొచ్చేవా? ఇలాఆలస్యంచేస్తే ఎలా చెప్పూ?'

'ఫలాహారంఅయ్యేదాకాఉండి పట్టుకొచ్చేనండీ. దశరాకివచ్చేవారుకాదూ? పోనివ్వండి జ్ఞాపకం వచ్చేంకాదూ ఇప్పటికేనా? బీదాళ్లని ఎప్పటికేనా మరవకండేం?'

'చూడూ. ఎంతప్రయత్నంచేశేను రావాలని! వీలయిందికాదు నిన్నొదిలిపెట్టి ఒకక్షణమేనా—'

'. కాఫీచాల్లారుతోంది . అవిపుచ్చుకోరూ?. అమ్మో, ఎంతచిక్కిపోయేరు! చదివేస్తున్నారేం బాగా?'

'అబ్బే ఆట్టే—?'

'తినరూ? వదలిపెట్టకండే ఒట్టు. సొంతం తినెయ్యాలి .అబ్బ! మీరు తిందురూ!'

'అలాకాదు—'

' ఒక్కమాట అడగనాండీ? నిజంచెబుతారూ?'

'ఏవిఁటి?'

'చెన్నపట్నంవెళ్ళేక జ్ఞాపకంవస్తానండీ ఎప్పుడేనా? చెప్పరూ?'

'నీదివ్య మంగళవిగ్రహం—'

'ఓస్! చెన్నపట్నం తీసుకెళుతున్నారు కాదూ?'

'పరీక్షలయ్యేక తప్పకుండా—'

'అన్నీఇలాగే కాఫీ అబ్బ, ఏవిఁటండీ. కాఫీ అంతా వొలికిపోతోంది'

'ఒట్టు సరళా నేనొప్పుకోను.'

'యేఁవండీ మరిచిపోయేరుకాదూ?'

'ఏవిఁటి'

'చూశేరూ? నేను రాశేనా?'

'అద్దా! . అక్కడే అపర్టుకింద అటు కాదు కుడివైపుని'

'ఎంతబాగుంది! ఎలాకొన్నారు. చెప్పరూ?'

'పెట్టుకో అల్లాగ సరళా చూడూ ఒక్కమారు—'

'అమ్మాయ్, సరళా!'

'ఓయ్, వస్తున్నా అమ్మపిలుస్తోందండీ ఉండరూ మళ్ళీవస్తానుకాదూ?'

'ఒట్టు'

## 3

'రాణీగారికి తమలపాకులకి సున్నం రాచిపెట్టడానికి ఇంకాతీరలేదుకాబోలు!'

'తీరికూచున్నారుగా మీరూ! ఓచెంప ఇల్లుకడుగుతుంటినా. కాస్సేపు ఓపికపట్టలేరేం పాపం?'

'ఏంకడగడం నామొహంకడగడం? ఎప్పుడూ కడగడమే! ఆకులకి సున్నంరాచి పెట్టేలోపునే మించిపోతుందేం పని?'

'ఎందుకుమించిపోతుందీ తీరిగ్గాకూచుని కబుర్లు చెబుతుంటే? కాస్తపోకాచెక్కా తెచ్చుకుంటే అరిగిపోతారాబాబూ? చేసేవాళ్ళపైని కొంచెమేనా అభిమానముండాలి.. ఎందుకూ, ఆడపుట్టకపుట్టాలి. పుడితే ఇలావేపుకు తింటారాఏం? మీమల్లేకనలేదూ మాఅమ్మానన్ను'

'ఇఖనేం అయినదానికీ కానిదానికీ అనవసర గ్రంథం నడిపించడం పైగాఏమేనాఅంటేకోపాలూ! అందరూ మనమల్లే—'

'ఎందుకుంటారూ? కోరితెచ్చి పెట్టుకున్నదేగా మీరూ? మీఅమ్మగారికి ఇష్టంలేదుటగా నన్ను చేసుకోడం ఆలింగరాజుగారి అమ్మాయినే చేసుకోలేకపోయేరూ? సుఖపడేవారు పాపం!'

'ఇదుగో, మళ్ళీ—'

'పైగా రోషమాయె నిమ్మళించిందాండీ ప్రాణం?'

'ఈ భాగ్యానికి అప్పుడే తెచ్చిపెడితేపోవునా? మాపూ ఇల్లారా'

'ఏవిఁటండీ ఊక్షే సిగ్గులేకపోతేసరి.'

## ౪

'ఏమే ఓయ్ ఒసే'

'యేఁవండీ!'

'మాట'

'ఎందుకండీ?'

'ఏవిఁటీ పిలుస్తుంటే, ఇంకాకాలేదా ఏం?'

'ఆ అవుతుంది అయినవాళ్ళనీ కానివాళ్ళనీ కొంపలోతెచ్చిపెడుతుంటే. రోజస్తమానంచేస్తుంటినాయను తెగితేనా దిక్కుమాలినచాకిరీ!'

'అయితే ఎవరేనా ఇంటికొస్తే—'

'మీకేం? చేసేవాళ్ళదుంపతెగుతూంది-ఆవిడగారికి తలనొప్పిట ఆపసోపాలుపడుతూ శుభ్భరంగా పడకవేసింది ఇఖఆవిడకి ఉపచారాలాయను-పిల్లలకాడినుంచి పెద్దలదాకా బంతులుతీర్చాలినుండె. ఎప్పటికి తెములుతుందీ?'

'ఏమిటేఊక్షే. ఎందుకొచ్చినసొద అవతలవాళ్ళు-దీనికేమిటి. అసలుసంగతి—'

'ఏవిఁటి?'

'అమ్మాయిమాట'

'అమ్మాయిమాటేమిటి?'

'అమ్మాయి మాటేమిటంటావేం? ఈడువచ్చిన పిల్లని ఇంట్లోపెట్టుకునీ. పురుషోత్తం రాశేడు. దీక్షితులుగారి రెండోకొడుకుట చెన్నపట్నంలో ప్లీడరీచదువుతున్నాట్ట కొద్దోగొప్పో భూమీపుట్రా ఉంది. మాఘమాసంలో చేద్దామనుకున్నాను. ఏం?'

'అడగఖ్ఖర్లేదు. మంచిసమ్మంధం వెదికేరే?

'పెద్దకోడల్ని మఖ్ఖపెడుతున్నారు గనక నా ఇఖ ఈవిడని—'

'అయిందీ, పెట్టేవూ పెటకం!'

'ఎందుకూ, నాకేంపట్టింది మధ్యని?—మొన్న మానుబ్బులు పెళ్ళికి వెళ్ళేనా, ఎంత బాగా జరిగింది! చక్కనిసమ్మంగం ఎంతపరువూ, ఎంతమర్యాదా, ఎంతో ఇదిగా జరిగింది ఇంతకీ అదృష్టం ఉండాలి!'

'ఆఁ'

'అవును మరీ, అదృష్టంగాకపోతే మరేవిఁటి?'

'నేనూ చేస్తున్నాను కాపరం ఆఖరకి ఒక్కఅంచుచీర—'

'పాపం నేను కొనిపెడుతున్నానా, నువ్వుకట్టుకుంటున్నావా! ఎప్పుడేనా చీరెల మొహంచూశేవూ?'

'చాల్లేదురూ'

'ఓయ్, మాట'

'అబ్బ!'

*

'ఏమేవ్ ..రామరామ పిలుస్తుంటేపలకవూ!'

'ఓయ్, వస్తున్నా'

'చస్తావు కొల్లాయిగుడ్డ ఎక్కడతగలపెట్టేవు?'

'తగలపెట్టడమూ, మంటపెట్టడమూను ఇదుగోనండీ'

'రామరామ ఎంతలక్షణంగానో ఉంది, అంటగట్టుకుపోయి చెబితినే!'

'గంధాక్షింతలు తీశేవూ?'

'పొయిమీద బోకె పొయిమీదేమండిపోతుండెను! ఎలాతియ్యనూ?'

'ఓసి నీ ఇల్లు—ఊఁ—తప్పుతుందీ! సానా చెక్కా—'

'అవుగో, అక్కడే పెట్టేనండీ—'

'ఎక్కడ? నా ఖర్మం కళ్ళుకనపడవు, కొట్టుకోనావరి!'

'స్తంభందగ్గిరసా—'

'ఎక్కడ?'

'ఆస్తంభం దగ్గిరండీ!'

'ఊఁ శ్వేతవరాహకల్పే వైవస్వతమన్వంతరే. ఓయ్, అబ్బాయి స్నానంచేశేట్టే?'

'లేదుగావుల్ను అబ్బ ఏంకట్టెలు వెధవకట్టెలు ప్రాణంతీ నేస్తున్నవి'

'ఏవిఁటీ!'

'మీమాటగాదండీ—'

'సరే ఊఁ పూలు, దీపారాధనా'

'...'

'ఓయ్, పూలూ, దీపారాధనా!'

'వింటున్నానండీ, పొయిలోగరిటె—'

'రామరామ అన్నీ నాప్రాణానికేవచ్చేయీ ఓయ్ మరీ లక్ష్యంలేకుండాపోతోంది రోజురోజుకూ'

'అబ్బ మరీని వేపుకుతింటున్నారండీ మనుష్యుల్ని'

'నమ-స్సో-మా-యచ, రు-ద్రాయచ, నమ-శ్శంభ-వేచ తాకేవోయ్, వెధవాయ్, బొత్తిగా భయభక్తులు పూలూ! రామరామ.'

'రామరామ,శివశివ ఇవుగో తగిలబడిపోయింది గరిటె—'

'పద్మనాభా - యనమః-ఓం కషాయంపెట్టేవుటే? ఆనందభైరవీ, కాస్తవాతరాక్షసమూ'

'ఎందుకూ కషాయాలు, కన్నవన్నీతింటూపైగా?'

'నైవేద్యం ఏమేవ్'

'ఎప్పటికీ మిట్టమధ్యాన్నమే ఖర్మం వడ్డించనాండీ?'

'మాధ్యాన్నికం కాలేదండీ, ఇంకానూ.'